# 'మహిళా శక్తి'లో ఆదర్శంగా నిలవాలి

- కొత్తగా తయారీ ఉత్పత్తులకు ప్రాధాన్యమివ్వాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, జూన్ 27(నమస్తే తెలంగాణ) : మహిళా శక్తి పథకంలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అన్ని మండలాల సీసీలు, ఏపీఎంలు, వీవోలకు మహిళా శక్తి పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు జీవనోపాధి కల్పించి, వారిని మరింత ఎక్కువగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 466 మంది వీవోలు, 11,201 స్వయం సహాయక సంఘాలు, 1,25,716 మంది సభ్యులు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో ఈ సంఘాల ద్వారా మహిళలకు లక్ష్యానికి మించి ఉపాధిని కల్పించాలని సూచించారు. ఇప్పటి వరకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పనలో అభివృద్ధి సాధించిన సీసీలు, వీవోలను కలెక్టర్ అభినందించారు. లబ్ధిదారులు మహిళా సంఘంలో తప్పనిసరిగా సభ్యులుగా ఉండాలన్నారు. బ్యాంకు లింకేజ్ ద్వారానే రుణాలు మంజూరవుతాయని తెలిపారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్ యూనిట్ల ఏర్పాటు కింద ప్రతి వీవో లక్ష్యాల వారీగా 25 మందిని గుర్తించి, మూడు రోజుల్లోగా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అలాగే, స్వయం సహాయక సంఘాల అకౌంటింగ్ యాప్‌లోనూ సంబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. పెరటికోళ్ల పెంపకానికి రూ.3 లక్షలు, పాడి, పశు పోషణ, సంరక్షణకు రూ.50వేల వరకు రుణం ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా శక్తి పథకం కింద సంఘంలో లేని 1800 మంది మహిళలను సంఘాల్లో చేర్చాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో లేని వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాల కల్పనకు శ్రీకారం చుట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి, వారికి సంబంధించిన వివరాలను తెలియజేయాలని వీవోలకు సూచించారు. మండలాల వారీగా నివేదికను కూడా సమర్పించాలని ఏపీఎం, డీపీఎం, సీసీలను ఆదేశించారు. అంతకుముందు మహిళా శక్తి పథకంపై సీసీలు, వీవోలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో డీఆర్డీవో మొగులప్ప, డీవీహెచ్‌వో ఎస్ఎల్ మనోహర్, ఏపీడీ శ్రీనివాస రావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ఏపీఎంలు, డీపీఎంలు, పాల్గొన్నారు.

**అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తిచేయాలి**

అమ్మ ఆదర్శ పాఠశాలల మిగిలిన పనులు, మిషన్ భగీరథ ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వే పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఎంఎన్‌వోలు, ఎంపీవోలు, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 491 అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా 291 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను గుర్తించి, పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే 236 బడుల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 55 బడుల్లో 75 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. వాటిని జూలై 7 లోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. లింగాల ఘనపురం మండలంలో 19 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తి చేసిన మండల ఎంఎన్‌వో విష్ణుమూర్తి, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఏఈ పూర్ణచందర్, మండల ప్రత్యేక అధికారి కేఆర్ లతను కలెక్టర్ సత్కరించారు. అనంతరం మిషన్ భగీరథ కింద ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వేపై సమీక్షించారు. సర్వే పనులను వేగవంతం చేసి, సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే సందర్భంగా గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని, యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో జడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీఈవో రాము, డీఆర్డీవో మొగులప్ప, సీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'రైతు భరోసాను వెంటనే అందజేయాలి'

పాలకుర్తి, జూన్ 27 : వానకాలం పంట సాగుకు ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసా సహాయం ప్రకటించలేదని, ఎప్పుడు అందజేస్తారో స్పష్టం చేయాలని బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు కడుదుల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో పంట పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వానకాలం సీజన్ ప్రారంభంలోనే రైతులకు రైతుబంధు ఇచ్చిందన్నారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎకరాకు రూ15వేలు రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చి, తీరా వచ్చాక రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా అందించి, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## 30న మండల సర్వసభ్య సమావేశం

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 27 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, మండల అధికారులు హాజరు కావాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

## 'ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి'

చిల్పూరు, జూన్ 27 : మండలంలో నిధుల వినియోగంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని వెంకటేశ్వరపల్లె, వెంకటాద్రిపేట ఎంపీటీసీ ఎన్నకూస కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సర్వసభ్య సమావేశంలో మండలంలో నాలుగున్నరేళ్లుగా వచ్చిన నిధులు, ఖర్చులకు సంబంధించి వివరాలు అడిగితే 15 రోజుల్లో ఇస్తామని చెప్పి, రెండు నెలలు అయినా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నాలుగు రోజుల్లో ఎంపీటీసీల పదవీకాలం పూర్తి కావొస్తున్నందున 2023-24లో వచ్చిన నిధులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామాలకు కేటాయించాలని సూచించారు. లేకపోతే సోమవారం మండల కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని ఆయన హెచ్చరించారు.

## రెవెన్యూ ఉద్యోగుల నిరసన

బచ్చన్నపేట/దేవరుప్పుల : రెవెన్యూ ఉద్యోగిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం బచ్చన్నపేటలో భోజన సమయంలో రెవెన్యూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఎంఆర్ఐపై దాడి చేసి, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ విశాలాక్షి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీటీ, ఆర్ఐలు పాల్గొన్నారు. అలాగే, ఎంఆర్ఐపై ఎమ్మెల్యే దాడిని ఖండిస్తూ మండల రెవెన్యూ ఉద్యోగులు గురువారం దేవరుప్పుల తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గిర్దావర్ రాజు, సిబ్బంది కృపాకర్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీధర్, భాగ్యలక్ష్మి, మంజుల, రాజు, మహేందర్, సర్వేయర్ అరుణ జ్యోతి, ఏఎస్‌వో మనోజ్‌కుమార్, చంద్రయ్య, యాకయ్య పాల్గొన్నారు.



పెంటయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## ఆకుల పెంటయ్యకు నివాళి

జనగామ, జూన్ 27(నమస్తే తెలంగాణ) : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఆకుల పెంటయ్య 12వ వర్ధంతిని గురువారం వ్యవసాయ మార్కెట్ గేటు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ పెంటయ్య మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా ప్రజలకు సేవలందించడంతోపాటు హమాలీల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సుంచు విజయేందర్, బోడ నరేందర్, పొతుకునూరి ఉపేందర్, వెంకటేశ్, అజారుద్దీన్, చందు నాయక్, నాయకులు ఎండీ దస్తగిరి, పాము కృష్ణమూర్తి, నిత్య నాయక్, కల్యాణం లింగం, బాల్నె వెంకట మల్లయ్య, లలిత, వరలక్ష్మి , గౌసియా, రాజు, అబ్రహం లింకన్ పాల్గొన్నారు.



మందులను చూపిస్తున్న డీఐ బాలకృష్ణ

## అధిక ధరలు ముద్రించిన ఔషధ కంపెనీపై కేసు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 27 : ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలు ముద్రించి, విక్రయిస్తున్న ఔషధ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు జనగామ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. వారం రోజుల క్రితం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా అధికారి పావనితో కలిసి స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి జంట పట్టణాల్లోని మెడికల్ స్టోర్లలో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శివునిపల్లి విఘ్నేశ్వర మెడికల్ స్టోర్‌లో తనిఖీ చేయగా హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కార్‌బాక్స్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఇట్రాగ్రిల్ – 200 ఎంజీ ఒక్క గోలి ప్రభుత్వం రూ.24 ధర నిర్ణయించగా కంపెనీ రూ.5 అధికంగా ముద్రించి రూ.29కి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సదరు కంపెనీపై, స్టాకిస్టుపై కేసు నమోదు చేసి, మందులను సీజ్ చేసినట్లు తెలిపారు.



రాజవరంలో మాత్రలు వేస్తున్న డాక్టర్ కుషాలీ

## నులి పురుగులను నిర్మూలించాలి

చిల్పూరు, జూన్ 27 : నులి పురుగులను నిర్మూలించాలని మండల వైద్యాధికారి కుషాలీ అన్నారు. మండలంలోని రాజవరంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 20న నిర్వహించిన కార్యక్రమంలో మాత్రలు తీసుకోని విద్యార్థులకు వేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు కాళ్లు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వో సోని, సూపర్‌వైజర్లు మంజులరాణి, విజయ, ఏఎన్‌యం సుశీల, ఆశలు పాల్గొన్నారు.



పిల్లల బరువు, ఎత్తు కొలుస్తున్న టీచర్ ఉష

## అంగన్‌వాడీ కేంద్రంలో బరువుల మేళా

బచ్చన్నపేట, జూన్ 27 : మండలంలోని కొన్నె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బరువుల మేళా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు మినలాపురం ఉష, విజయ ఆధ్వర్యంలో చిన్నారుల బరువు, ఎత్తు కొలిచారు. తల్లితండ్రులు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, ఏఎన్ఎం పద్మావతి పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన నరేశ్‌కుమార్

బచ్చన్నపేట జూన్ 27: కేంద్ర మంత్రి చౌదరి జయంతిసింగ్‌ను మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్ కుమార్ గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలోని యువత, నిరుద్యోగులకు ఉపయోగపడేలా నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.



కేంద్ర మంత్రితో నరేశ్

## అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు : డీఈవో



బండనాగారంలో మాట్లాడుతున్న డీఈవో రాము

బచ్చన్నపేట, జూన్ 27 : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అంకితభావంతో పని చేస్తేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జనగామ డీఈవో రాము అన్నారు. గురువారం మండలంలోని బండనాగారం గ్రామ పాఠశాలలో హెచ్‌ఎం బందారపు లక్ష్మయ్య ఉద్యోగవిరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్ని ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. అనంతరం అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు కొమ్మాల ఎల్లమ్మ, గౌరవ అధ్యక్షురాలు రేణుక, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు నాగిరెడ్డి, వేణుగోపాల్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు, కేయూ డైరెక్టర్ రామచంద్రం, పాఠశాల ఉపాధ్యాయులు సిద్దయ్య, మడూరి వెంకటేశ్, రాజేందర్, సుజాత, అంగన్‌వాడీ టీచర్ సుంకోజు రజిత తదితరులు లక్ష్మయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం మండల అధ్యక్షురాలు గణపురం కవిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఇజ్జగిరి బాలలక్ష్మి, రాజనర్సు, ఏఎన్ం ప్రణిత, కార్యదర్శి భరత్, ప్రేమలక్ష్మి, అఫ్జల్, అంకుషావలీ, వినయ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మూర్తి పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు భద్రయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

## పెదమడూరులో ఉపాధ్యాయుడికి సన్మానం

దేవరుప్పుల, జూన్ 27 : పెదమడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి ఇటీవల ఉద్యోగోన్నతిపై వెళ్లిన భద్రయ్యను గురువారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నల్ల ఉమేశ్, రుద్రోజు పురుషోత్తం, మానుపాటి వెంకటేశ్, దుబ్బ రాజశేఖర్, చంద్రగిరి సంపత్, మలిపెద్ది వెంకటేశ్, మానుపాటి ఉపేందర్, ఒగ్గు మల్లేశ్, ఆకవరం రాజు, జోగు శ్రీశైలం పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

లింగాలఘనపురం, జూన్ 27 : గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీవో మల్లికార్జున్ అన్నారు. లింగాలఘనపురంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకేంద్రం సమీపంలో వీధి బురద మయమైందని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. అలాగే, సబ్‌స్టేషన్ నుంచి ఎస్సీ కాలనీకి సీసీ రోడ్డు కావాలని కోరినట్లు తెలిపారు. ఈ మేరకు సమస్యలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేమిడి భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కారోబార్ బోయిని సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## వృద్ధులకు చేతికర్రలు అందజేత

బచ్చన్నపేట, జూన్ 27 : మండలంలోని కొన్నె గ్రామంలో 150 మంది వృద్ధులకు కోడూరు శివప్రసాద్ చేతి కర్రలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిస్సహాయస్థితిలో ఉన్న వారికి సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్ల సిద్దిరాములు, తాటికొండ నర్సింహాచారి, బడకోలు శ్రీనివాస్‌రెడ్డి, భద్రయ్య, తేలు శ్రీనివాస్, శ్రీకాంత్, అంబాల క్రాంతికుమార్, పసుల కమలాకర్ పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

లింగాలఘనపురం, జూన్ 27 : మండలంలోని నెల్లుట్లలో వనమాల చక్రపాణి తన కిరాణ షాపులో నిషేధ పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తుండగా గురువారం వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. ఉత్పత్తులను విక్రయిస్తున్న చక్రపాణితోపాటు సరఫరా చేస్తున్న జనగామకు చెందిన విక్రమ్‌సింగ్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుని ఇద్దరిని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీలు రాజేశ్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

## గుట్కా విక్రయిస్తున్న వారిపై కేసు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 27 : అక్రమంగా గుట్కా అమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్కు రాజు తెలిపారు. శివునిపల్లిలో నిషేధిత గుట్కా అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా రడపాక శ్రీనివాస్, నర్సయ్య వద్ద సుమారు రూ.3,450 విలువైన గుట్కా ప్యాకెట్లు దొరికాయి. దీతో వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి గ్రామస్తుల చేయూత

బచ్చన్ననేట, జూన్ 27 : మండలంలోని ఆలీంపూర్ గ్రామానికి చెంది ఓ నిరుపేద మహిళ చాడ సిద్దమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించే స్తోమత లేకపోవడంతో గ్రామంలోని ఆలీంపూర్ గ్రూపులో వాట్సప్ ద్వారా సాయం అందించాలని కోరగా వెంటనే గ్రామస్తులు, యువకులు, పెద్దలు అందరూ మృతురాలి కుమారుడికి గంటలో రూ.40వేల వరకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సాయం చేసిన వారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పడకేసిన ఆరుపడకల దవాఖాన

- పేరుకే 24 గంటలు.. సేవలు మాత్రం నిల్
- ప్రసూతికి జనగామకు వెళ్లాల్సిందే..
- ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు



లింగాలఘనపురంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

లింగాలఘనపురం, జూన్ 27 : మండల కేంద్రంలోని ఆరు పడకల 24 గంటల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పడకేసింది. ఈ దవాఖాన ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రజలకు సంతృప్తికరంగా వైద్యసేవలు అందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా స్థానిక గర్భిణులు పురుడు పోసుకునేందుకు ఈ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 24 గంటలు ఈ కేంద్రంలో ముగ్గురు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా ప్రభుత్వం దాన్ని మరచిపోయింది. ఒకే ఒక్క డాక్టరు, స్టాఫ్‌నర్సును మాత్రమే నియమించి చేతులు దులుపుకుంది. ఈ డాక్టర్‌కు మండలంలోని లింగాలఘనపురం, నవాబుపేట, వడిచర్ల, వనపర్తి, చీటూరు, కుందారం, జీడికల్, కళ్లెం, సిరిపురం, మాణిక్యపురం సబ్‌సెంటర్ల పర్యవేక్షణ బాధ్యతలను కూడా అప్పగించడంతో అతడు అందరికీ వైద్య సేవలు అందించలేకపోతున్నాడు. పీహెచ్‌సీలో ఓ రెండు మూడు గంటలు మాత్రమే రోగులకు అందుబాటులో ఉంటున్నాడు. మధ్యాహ్నం తర్వాత వైద్యసేవలు అందడం లేదు. గతంలో ఓ స్టాఫ్‌నర్సు ఉండడంతో ఆమెపై ఎక్కువ పనిభారం పడేది. రాత్రి, పగలు ఆమే వైద్యసేవలు అందించేది. అయితే, ఆ ఒక్క స్టాఫ్‌నర్సునూ బదిలీ చేయడంతో ప్రస్తుతం దవాఖాన ఎందుకూ పనికిరాకుండా పోయింది. పేరుకు మాత్రమే 24 గంటల దవాఖాన అని, సేవలు మాత్రం నిల్ అని, ఎందుకీ దవాఖాన అంటూ స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మరో ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులను నియమించి, మండల ప్రజలకు వైద్యసేవలను అందించాలని కోరుతున్నారు.

**ఎందుకీ దవాఖాన..?**



లింగాలఘనపురానికి అనుకొని నాగారం, బండ్లగూడెం, కొత్తపెల్లి, పటేలుగూడెం, నెల్లుట్ల గ్రామాలున్నాయి. కాలినడకన ఈ కేంద్రానికి వైద్యసేవల కోసం రోజూ ప్రజలు వస్తూ పోతుంటారు. డాక్టరు ఓ రెండు గంటలు మాత్రమే చూస్తున్నాడు. తర్వాత దవాఖానకు తాళమే కనబడుతుంది. అధికారులు సిబ్బందిని నియమించి ప్రజలకు వైద్యసేవలను అందించాలి.

–ఏదునూరి వీరన్న, లింగాలఘనపురం

**సిబ్బంది కొరత ఉంది..**



లింగాలఘనపురంలో ఆరు పడకల 24 గంటల పీహెచ్‌సీ ఉంది. ముగ్గురు డాక్టర్లు ఉంటే సేవలు అందుతాయి. ముగ్గురు స్టాఫ్ నర్సులూ ఉండాలి.. పది మంది సెకండ్ ఏఎన్ఎంలు ఉన్నారు. అందులో ఇద్దరు ఎర్రబెల్లి ట్రస్టు నుంచి పని చేస్తున్నారు. ప్రసూతి చేయాలన్నా.. సూదులు.. మందులూ ఇవ్వాలన్నా స్టాఫ్‌నర్సులే ఇవ్వాల్సి ఉంటుంది. వాళ్లు లేకపోవడంతో వైద్యసేవలను అందించలేకపోతున్నాం.

– కరుణాకర్‌రాజు, మండల వైద్యాధికారి



పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎమ్మెల్యే పల్లాను కలిసిన నాయకులు

జనగామ రూరల్, జూన్27 : విదేశీ పర్యటన ముగించుకుని, స్వదేశానికి వచ్చిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, పార్టీ మండల అధ్యక్షుడు బూరగోని యాదగిరి గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు చినబోయిన రేఖా రాజు, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు బూరెడ్డి ప్రమోద్ రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు కృషి చేయాలి

బచ్చన్నపేట జూన్ 27 : నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, బ్లూకోల్ట్స్ ఇతర బృందాల పనితీరుపై ఆరా తీసి, సంతృప్తిని వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించి, దొంగ తనాలు జరగకుండా చూడాలన్నారు. డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్, హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ శ్రీనివాస్, రాకేశ్ పాల్గొన్నారు.

## గ్రామస్తుల సహకారంతోనే స్కూళ్ల అభివృద్ధి



విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ప్రవీణ్

రఘునాథపల్లి జూన్ 27 : గ్రామస్తుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని కొమల్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంతోష్ అన్నారు. గురువారం పాఠశాలలో పూర్వ విద్యార్థి కన్నారపు ప్రవీణ్ విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను మరువద్దనే ఉద్దేశంతో ప్రవీణ్ నోట్‌బుక్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేకల మురళి, నాయకులు బొల్లపల్లి ఎర్ర కుమారస్వామి, మేకల నరేందర్, మంకెన అన్నపురెడ్డి, బంధ కుమారస్వామి, తాళ్లపల్లి యాదగిరి, తాటికొండ వెంకటేశ్ యాదవ్, పొన్నం రాజు పాల్గొన్నారు.



నీటి కోసం పొలాల్లోని బావుల వద్దకు వెళ్లిన గిర్నితండా మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ విద్యార్థినులు

# విద్యార్థుల నీటి కష్టాలు

- పంట పొలాలకు వెళ్లిన వైనం
- ఉదయం సోషల్ మీడియాలో వైరల్
- మధ్యాహ్నం సమస్యకు పరిష్కారం
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

కొడకండ్ల, జూన్ 27 : రోజువారీ అవసరాల కోసం నీరు లేక మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ విద్యార్థినులు అవస్థలు పడ్డారు. పంట పొలాల్లోని బావుల వద్ద నుంచి బకెట్లలో తెచ్చుకున్నారు. ఈ ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మోటర్ పనిచేయకపోవడంతో మూడు రోజులుగా హాస్టల్‌లో నీరు లేదు. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతూ పొలాల్లోని బావుల నుంచి తెచ్చుకుంటున్నారు. దీనిని చూసిన స్థానికులు అధికారులపై మండిపడ్డారు. వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. స్పందించిన సంబంధిత అధికారులు వెంటనే మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను హాస్టల్‌లోకి వేసి ట్యాంక్‌ను నింపారు. అలాగే మోటర్‌ను మరమ్మతు చేయించడంతో సమస్య పరిష్కారమైంది. ఈ విషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చేతనను వివరణ కోరగా మోటరు పాడవడంతో ఉదయం వేళ అవసరాల కోసం పంట పొలాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకున్నారని తెలిపారు. వెంటనే మోటరు బాగు చేయించి మధ్యాహ్నం వరకు నీటిని అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు.



సమస్యను పరిష్కరించడంతో ట్యాంకులోకి చేరుతున్న నీరు

## 'మత్స్యకారులకు నగదు బదిలీ చేయాలి'

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 27 : మత్స్య కారులకు ఉచిత చేప పిల్లలకు బదులు సొసైటీలకు నగదు బదిలీ చేయాలని తెలంగాణ మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగల రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఆయన నివాసంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష్య , కార్యదర్శులు నిమ్మల విజేందర్, గోడుగు వెంకట్ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి ప్రత్యేక బడ్జెట్ ద్వారా ఉచిత చేప పిల్లల పథకానికి రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు. జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి భిక్షపతి, సహాయ కార్యదర్శి నీరటి చంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు కండ్లకోల కిషన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, MASHUQ RABBANI SOHAIL MOHAMMED (New Name) previously called MOHAMMED M R SOHAIL (Old Name) and Residing at H.No. 16-1-846, SRR Thota, Kareemabad, Warangal Dist. T.S., India Solemnly declare.
NTW-000

CHANGE OF NAME
★I, SHAMSHUDDIN SULTAN ALI DHANANI, R/o. 8-9-183, Polavari Street, Sadashiva Nilayam, Warangal, Telangana. Changed My Name as SHAMSHUDDIN DHANANI.
NT-328263

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557